వనం..మనం.. మనఊరి కోసం
RNI/APTEL/26/A3829



# ప్రభ మనం

TELUGU DAILY
తెలుగు డైలీ
Gmail: prabhamanam@gmail.com

విలేకరులు కావలెను.
WANTED... WANTED...
ఆంధ్ర, తెలంగాణ నుండి
వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక
ప్రభ మనం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు,
ఆర్సి ఇంచార్జిలు,సిసి ఇంచార్జిలు మరియు మండల
విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్: వి. లింగమూర్తి
9000367833, 8074937223

కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 59 | పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com | శనివారం 18-07-2026

## వైసీపీ ప్రభుత్వం చేసిందే ఇప్పుడు

కూటమి ప్రభుత్వం చేస్తోంది



- అమ్మఒడి ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ మోసం చేసిందన్న షర్మిల
- కూటమి ప్రభుత్వం కూడా తల్లులను మోసం చేస్తోందని విమర్శ
- మిగతా 20 లక్షల మంది బిడ్డలకు పథకాన్ని అందజేయాలని డిమాండ్

కూటమి ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. - మిగతా 2 లో

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

నరసరావుపేటలో సీఎం చంద్రబాబు

- గత పాలన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కేంద్రమే ఆదుకుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- నరసరావుపేటలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రుణాల పంపిణీ
- వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేత
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలోని అధిక వడ్డీ అప్పుల రీషెడ్యూల్ చేశామన్న సీఎం
- 2047 నాటికి ఏపీని హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దుతామని వెల్లడి

2లో



గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి

## హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది



- అదే నాలో కసిని పెంచింది: మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్
- మంగళగిరిలో రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగం
- 91 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని భావోద్వేగ ప్రసంగం
- డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని స్పష్టీకరణ

"హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారీ నాకు అసూయ కలుగుతుంది. అక్కడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, ఐటీ టవర్లు - మిగతా 2 లో

## అమెరికా దాడులతో విద్యుత్ సంక్షోభం

ప్రజలకు ఇరాన్ ప్రభుత్వం కీలక సూచన



- విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరిగాయని తొలిసారి అంగీకరించిన ఇరాన్
- అమెరికా వైమానిక దాడుల నేపథ్యంలో ప్రకటన
- తీవ్రమైన వేడి కారణంగా విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి
- హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతల మధ్య కొనసాగుతున్న అమెరికా దాడులు

అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, తమ దేశ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నట్లు ఇరాన్ - మిగతా 2 లో

## భారత్‌పై ఫిర్యాదు.. ఖర్చు మొత్తం భరిస్తున్న పాక్

సింధు జలాల వివాదంలో ట్విస్ట్

- సింధు జలాల వివాదంపై అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంస్థను ఆశ్రయించిన పాక్
- విచారణను బహిష్కరించిన భారత్
- భారత ఖర్చులనూ చెల్లిస్తున్న పాక్
- ఇప్పటి వరకు రూ.5.2 కోట్లకు పైగా ఖర్చు
- మున్ముందు మరింత పెరగనున్న భారం



భారత్‌పై అంతర్జాతీయ మధ్యవర్తిత్వ సంస్థను ఆశ్రయించిన పాకిస్థాన్‌కు ఇప్పుడు అదే కేసు భారంగా మారింది. సింధు జలాల - మిగతా 2 లో

# భారత్‌లో సరికొత్త శకం

తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

- హర్యానాలో తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలుకు పచ్చజెండా ఊపిన ప్రధాని
- జింద్-సోనిపట్ మధ్య పరుగులు పెట్టనున్న హైడ్రోజన్ రైలు
- హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం
- ఢిల్లీ-కత్రా మధ్య ప్రయాణ సమయాన్ని 14 నుంచి 6 గంటలకు తగ్గించనున్న కొత్త ఎక్స్‌ప్రెస్‌వే
- కురుక్షేత్రలో ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, కొత్త మెడికల్ కాలేజీలను జాతికి అంకితం


2లో



స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు.

## సౌదీ-ఇరాన్ల మధ్య నలిగిపోతున్న పాకిస్థాన్

హౌతీ దాడుల వేళ సంకటంలో ఇస్లామాబాద్!




- 'హర్మూజ్' సంక్షోభం, హౌతీ దాడుల నేపథ్యంలో తీవ్ర ఒత్తిడిలో పాకిస్థాన్
- సౌదీ అరేబియాతో ఉన్న దశాబ్దాల రక్షణ ఒప్పందాలను నిలబెట్టుకోవాల్సిన సవాలు
- పొరుగు దేశమైన ఇరాన్‌తో సంబంధాలు దెబ్బతినకుండా మధ్యవర్తిత్వానికి పాక్ ప్రయత్నాలు
- సౌదీ చమురు క్షేత్రాలపై దాడులు జరిగితే సైనిక సాయం చేయడానికి ఇస్లామాబాద్ సిద్ధం?
- పశ్చిమాసియాలో సంక్షోభం ముదిరితే పాక్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం

హర్మూజ్ జలసంధి కేంద్రంగా పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధ జ్వాలలు ఇప్పుడు - మిగతా 2 లో

## యూపీలో ప్రతిపక్షాల లక్ష్యం అరాచకమే

వారు జిన్నా ఆరాధకులు: సీఎం యోగి ఆదిత్యనాథ్



- ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు జిన్నా ఆరాధకులంటూ సీఎం యోగి తీవ్ర వ్యాఖ్యలు
- షామ్లీలో రూ.581 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- 2017కు ముందు షామ్లీ ఉగ్రవాదానికి, వలసలకు కేంద్రంగా ఉండేదని విమర్శ
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో యూపీ స్వరూపమే మారిపోయిందని వ్యాఖ్య
- చెరకు రైతులకు మెరుగైన ధర, చెల్లింపులు అందుతున్నాయని వెల్లడి

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రతిపక్షాలైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ - మిగతా 2 లో

## అల్పపీడన ప్రభావం

తెలంగాణలో వానలు ఉక్కపోత నుంచి ఉపశమనం



- బంగాళాఖాతంలో అల్పపీడనంతో తెలంగాణలో వర్షాలు
- ఉక్కపోత నుంచి ప్రజలకు తాత్కాలిక ఉపశమనం
- ఈ నెల 22 వరకు పలుచోట్ల వానలు కురిసే అవకాశం
- ఆందోళనలో ఉన్న రైతులకు ప్రస్తుత వర్షాలతో ఊరట
- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో జల్లులు

గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు - మిగతా 2 లో

## మంత్రి వాకిటి శ్రీహరికి అస్వస్థత.. కేర్ ఆసుపత్రిలో చికిత్స



- తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వాకిటి శ్రీహరి
- రెస్ట్ తీసుకుంటే సరిపోతుందన్న వైద్యులు
- శ్రీహరి ఆరోగ్య గురించి వాకబు చేసిన రేవంత్ రెడ్డి

తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను కుటుంబ - మిగతా 2 లో

# ధరణి పోర్టల్‌పై సిట్ విచారణ

- తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయాలు
- తెలంగాణ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది
- ప్రత్యేకంగా ధరణి పోర్టల్‌పై సిట్ విచారణ చేయాలని నిర్ణయించగా..
- బుల్లెట్ రైలు, మెట్రో రైలు తదితర అంశాలపై తెలంగాణ మంత్రివర్గం నిర్ణయాలు తీసుకుంది
- మంత్రివర్గంలో ఏమేం నిర్ణయాలు తీసుకున్నారో తెలుసుకుందాం.

2లో




తెలంగాణలో అత్యంత వేగంగా మారుతున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెలంగాణ మంత్రివర్గ సమావేశమైంది. కీలక అంశాలపై చర్చించిన తెలంగాణ మంత్రిమండలి ధరణి పోర్టల్‌పై సిట్ విచారణ చేయాలని నిర్ణయించింది. నీటి పారుదల ప్రాజెక్టులపై మంత్రిమండలి అంచనాలు సవరించింది. హైదరాబాద్

# అల్పపీడన ప్రభావం

మొదటిపేజీ తరువాయి – వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో ప్రజలకు వేడి నుంచి ఉపశమనం లభించింది. ఈ నెల 22వ తేదీ వరకు రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా–పశ్చిమబెంగాల్ తీర ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర, మధ్య జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ఇవాళ తెల్లవారుజామున హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. రేపు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బలమైన ఉపరితల గాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. నిన్న సాయంత్రం నుంచే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లిలో 4.3 సెంటీమీటర్లు, నల్గొండ జిల్లా చండూరులో 3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడ్డాయి. నిన్న పగటిపూట నిజామాబాద్‌లో సాధారణం కన్నా 3.8 డిగ్రీలు అధికంగా 35.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, సాయంత్రానికి వాతావరణం చల్లబడటం గమనార్హం. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సాగు పనులు నెమ్మదించాయి. ఇలాంటి తరుణంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న ఈ వర్షాలు వ్యవసాయ పనులకు ఊతమిస్తాయని, పంటలకు జీవం పోస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు లేకపోయినా, ఈ జల్లులు ఎండల తీవ్రతను తగ్గించి ప్రజలకు, రైతులకు కొంత ఊరటనిస్తున్నాయి.

## మంత్రి వాకిటి శ్రీహరికి అస్వస్థత.. కేర్ ఆసుపత్రిలో చికిత్స

మొదటిపేజీ తరువాయి – సభ్యులు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర జ్వరం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న మంత్రికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఆరోగ్యం సరిగా లేదని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ప్రస్తుతం మంత్రి వాకిటి శ్రీహరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మరో రెండు రోజుల రెస్ట్ తీసుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు. మంత్రి త్వరగా కోలుకోవాలని అభిమానులు, పార్టీ నాయకులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, పార్టీ నాయకులు మంత్రి వాకిటి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. వాకిటి శ్రీహరి త్వరగా పూర్తి కోలుకుని ప్రజా సేవలో కొనసాగాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి.

## గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (ఛీూూ) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వం చేసిందే ఇప్పుడు

మొదటిపేజీ తరువాయి – "తల్లికి వందనానికి పంగనామం–బిడ్డలకు ఎగనామం" ఇదే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీ అంటూ ఆమె విమర్శించారు. అంతేకాదు గత ముఖ్యమంత్రి జగన్‌కి వారసుడు నేటి సీఎం చంద్రబాబు అంటూ ఆమె ఎద్దేవా చేశారు. గత వైసీపీ మోసాలను తు.చ తప్పకుండా పాటించడం కూటమి ప్రభుత్వ విధానమైందని మండిపడ్డారు. అమ్మఒడి పేరుతో ఒక్క బిడ్డకే ఇచ్చి వైసీపీ ప్రభుత్వం తల్లులను పచ్చిమోసం చేసిందని వ్యాఖ్యానించారు. "నీకు 15, నీకు 15, ఎంతమంది ఉంటే అన్ని 15 వేలు అని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు చంద్రబాబు తల్లులను నయవంచన చేస్తున్నారని షర్మిల ఆరోపించారు. కోతల రాయుడు కోతలంటూ జగన్ ను ఎద్దేవా చేసిన చంద్రబాబే మళ్లీ కోతలకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యారని విమర్శించారు. తల్లికి వందనంపై నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే 87 లక్షల మంది బిడ్డలకి ఇవ్వాల్నారు. కోతలు పెట్టకుండా ప్రతి బిడ్డకు 15 వేలు జమ చేయాలన్నారు. కొర్రీలు పెట్టకుండా మిగతా 20 లక్షల మంది బిడ్డలకు పథకాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ పాలనలో అమ్మఒడి పథకం కింద ఒక్కబిడ్డకే ఇచ్చి తల్లులను మోసం చేశారని... ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే మార్గం అనుసరిస్తోందని షర్మిల ఆరోపించారు. తల్లికి వందనం పథకం కేవలం ఎన్నికల ముందు ఇచ్చిన హామీగా మిగిలిపోయిందని విమర్శించారు.

## హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది

మొదటిపేజీ తరువాయి – చూసినప్పుడు కలిగే ఆ అసూయే.. నాలో కసిని పెంచింది. ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకాన్ని ఇచ్చింది" అని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శక్తిమంతమైన ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఆధునిక హంగులతో కూడిన మంగళగిరి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ సభలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన ప్రసంగంలో అభివృద్ధి, రాజకీయాలు, వ్యక్తిగత ప్రస్థానాన్ని కలగలిపి, ప్రజల్లో నూతనోత్సాహం నింపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని లోకేశ్ కొనియాడారు. "ఒకప్పుడు రైళ్లు సమయానికి వచ్చేవి కావు, బోగీలు శుభ్రంగా ఉండేవి కావు. కానీ నేడు వందే భారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ భద్రతా టెక్నాలజీ, 100 శాతం విద్యుదీకరణతో రైల్వే రంగం స్వరూపమే మారిపోయింది. దేశాభివృద్ధికి రైల్వేలే కీలకమని ప్రధాని మోదీ బలంగా విశ్వసిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సభాముఖంగా కోరారు. అమరావతి అభివృద్ధిపై లోకేశ్ తన దార్శనికతను స్పష్టం చేశారు. "రాజధాని అమరావతికి రోడ్డు, రైలు, వాయు మార్గాల అనుసంధానం అత్యంత కీలకం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఈ మూడింటినీ అనుసంధానిస్తూ ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. 2019–24 మధ్య ఆగిపోయిన అమరావతి పనులను ఇప్పుడు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిని ఒక గ్లోబల్ సిటీగా మార్చడమే మా అందరి లక్ష్యం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఉన్న 'డబుల్ ఇంజన్ సర్కార్'తోనే ఇది సాధ్యమని ఆయన అన్నారు. దశాబ్దాల కల అయిన విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రధాని మోదీ ఆచరణలోకి తెచ్చారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మంగళగిరితో తనకున్న అనుబంధాన్ని, రాజకీయ ప్రయాణాన్ని లోకేశ్ భావోద్వేగంగా పంచుకున్నారు. "2019లో 5,300 ఓట్లతో ఓడిపోయినప్పుడు కుంగిపోలేదు. ఐదేళ్లు మీ మధ్యనే ఉన్నా, చెమటోడ్చి కష్టపడ్డా, మీ మనసు గెలుచుకున్నా. నేను ఏ మెజారిటీతో అయితే ఓడిపోయానో, దాని పక్కన ఒక సున్నా పెట్టి గెలిపించాలని కోరాను. మీరు నా మాట నిలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే టాప్–3 మెజారిటీతో, 91 వేల ఓట్ల ఆధిక్యంతో నన్ను గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ గెలుపు నాకు కొండంత బలాన్నిచ్చింది, నాపై బాధ్యతను పెంచింది" అని అన్నారు. ఈ మెజారిటీని చూపించే కేంద్ర, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గానికి పనులు చేయిస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ కలిసి పనిచేస్తే ఒక ప్రాంతం ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంగళగిరి ఒక ఉదాహరణ అని లోకేశ్ అన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేస్తూ లక్ష్మీ నరసింహ స్వామి గుడి అభివృద్ధికి, భూగర్భ డ్రైనేజీ వంటి పనులకు కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, గూగుల్, అదానీ అంకా వంటి పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, రాబోయే మూడేళ్లలో యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజల కోసం అహర్నిశలు కష్టపడతానని, వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

# ధరణి పోర్టల్‌పై సిట్ విచారణ

మొదటిపేజీ తరువాయి – మెట్రో రైలు రెండో దశ పురోగతప.. ఎల్‌నినో ప్రభావం, తాగునీటి భద్రతపై మంత్రిమండలి చర్చ జరిగింది. హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశం కొన్ని గంటల పాటు సాగింది. నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రిమండలి సమీక్ష చేసింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతోపాటు నిర్మాణంలో ఉన్న ఇతర సాగునీటి ప్రాజెక్టులపై, మెట్రో రైలు రెండో దశ పురోగతిపై, కేంద్రం కమిటీ ఏర్పాటు జాప్యంపై ప్రభుత్వ వైఖరిపై మంత్రిమండలి చర్చ చేసింది. ఎల్–నినో ప్రభావం, తాగునీటి భద్రత చర్యలపై చర్చించింది. బుల్లెట్ ట్రైన్ భూ సేకరణ, వ్యయ అంశాలపై చర్చ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పురోగతిపై మంత్రిమండలి చర్చ చేసింది. కృష్ణా––గోదావరి జల వివాదం, సుప్రీంకోర్టు వ్యవహారంపై వ్యూహం వంటి పలు కీలక పరిపాలనా, అభివృద్ధి ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ధరణి పోర్టల్ అక్రమాలపై సిటి విచారణ కు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. జగిత్యాల జిల్లా డిగ్రీ కాలేజీలో పలు పోస్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హౌస్ చెరులో ఇందిరమ్మ ఇళ్ల కోసం భూమి కేటాయింపుకు మంత్రిమండలి నిర్ణయించింది. బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం––2018 సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పలు పరిపాలనా, అభివృద్ధి అంశాలకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.

### విచారణకు సిద్ధం

ధరణి అక్రమాలపై సిట్ విచారణకు ప్రభుత్వం సిద్ధమైంది. ధరణి పోర్టల్‌లో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ధరణి పోర్టల్‌పై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యూటేషన్లపై విచారణకు మంత్రిమండలి నిర్ణయించింది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపై దృష్టి సారించింది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధమైందని ప్రకటించింది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు ఇవ్వాలని.. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపై వివరాల సేకరణ చేసింది. అక్రమంగా లబ్ధి పొందిన వారిపై కేసుల నమోదుకు అవకాశం. ధరణి పోర్టల్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, పత్రాల పరిశీలన ప్రారంభమైంది. బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భూ పరిపాలనలో పారదర్శకతకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని.. సిట్ విచారణతో ధరణి అక్రమాల అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# అమెరికా దాడులతో విద్యుత్ సంక్షోభం

మొదటిపేజీ తరువాయి – అంగీకరించింది. మరోవైపు, దేశంలోని దక్షిణ ప్రావిన్సులలో తీవ్రమైన వేడిగాలులు వీస్తుండటంతో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఇరాన్ విద్యుత్ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దాడుల తీవ్రత అధికంగా ఉన్న దక్షిణ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరాన్ ప్రభుత్వం సూచించింది. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరడం, మరోవైపు విద్యుత్ వ్యవస్థలే లక్ష్యంగా దాడులు జరుగుతుండటంతో ప్రజలు సాధ్యమైనంత వరకు విద్యుత్ ఆదా చేయాలని కోరింది. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం అమెరికా, ఇరాన్ మధ్య వివాదం ముదురుతున్న తరుణంలో, ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా వైమానిక దాడులను కొనసాగిస్తోంది. గతంలో ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేస్తామని అమెరికా హెచ్చరించిన విషయం తెలిసిందే. తాజాగా ఇరాన్‌లోని పలు లక్ష్యాలను ఛేదించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ దాడుల్లో విద్యుత్ ప్లాంట్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు లేదా ఇతర వ్యవస్థలు ఎంతవరకు దెబ్బతిన్నాయనే వివరాలను మాత్రం ప్రభుత్వం వెల్లడించలేదు. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న దాడుల వల్ల విద్యుత్ నెట్‌వర్క్‌లోని దాదాపు 2,000కు పైగా ప్రాంతాల్లో నష్టం వాటిల్లిందని, వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు. పాతబడిన వ్యవస్థలు, అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఆధునీకీకరణకు నోచుకోకపోవడం, వేసవిలో పెరుగుతున్న డిమాండ్ వంటి కారణాలతో ఇరాన్ విద్యుత్ గ్రిడ్ ఇప్పటికే సంక్షోభంలో ఉంది. తాజా దాడులు ఈ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేశాయి. ఈ దాడుల కారణంగా ఇప్పటివరకు 38 మంది మరణించగా, 400 మందికి పైగా గాయపడ్డారని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. చబహార్ పోర్టు సమీపంలో కూడా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా అధికారికంగా విద్యుత్ కోతలు విధించనప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా దక్షిణ ప్రాంత ప్రజలు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# యూపీలో ప్రతిపక్షాల లక్ష్యం అరాచకమే

మొదటిపేజీ తరువాయి – ఆ పార్టీలను 'జిన్నా ఆరాధకులు' అంటూ ఘాటుగా విమర్శించారు. వారికి అవకాశం దొరికినప్పుడల్లా కులం, ప్రాంతం పేరుతో సమాజాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తారని ఆయన ఆరోపించారు. అరాచకాన్ని వ్యాప్తి చేయడం, మహిళలు, వ్యాపారుల భద్రతను బలహీనపరచడమే వారి ఏకైక లక్ష్యమని సీఎం యోగి దుయ్యబట్టారు. నేడు షామ్లీ జిల్లాలో రూ.581 కోట్ల విలువైన 89 అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 2017కు ముందు, ఆ తర్వాత పరిస్థితులను పోల్చి చూస్తూ సీఎం యోగి మాట్లాడారు. ఒకప్పుడు షామ్లీ జిల్లా ఉగ్రవాదానికి, సామూహిక వలసలకు, గూండాయిజానికి కేంద్రంగా ఉండేదని, కానీ నేడు తమ ప్రభుత్వం హయాంలో అభివృద్ధికి చిరునామాగా మారిందని ఆయన అన్నారు. "2017కు ముందు ఇక్కడ అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. విద్యుత్, భద్రత, వైద్యం వంటి కనీస సౌకర్యాలు దయనీయంగా ఉండేవి. గూండాలు, పోకిరీలు వీధుల్లో బహిరంగంగా తిరిగేవారు. ఆడపిల్లలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడే పరిస్థితి. రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొని ఉండేది. కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవన్నీ గత చరిత్రగా మిగిలిపోయాయి. యూపీ ముఖచిత్రం, తలరాత పూర్తిగా మారిపోయింది" అని యోగి వివరించారు. ఢిల్లీ–డెహ్రాడూన్, షామ్లీ–అంబాలా, ప్రతిపాదిత షామ్లీ–గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంతో భవిష్యత్తులో ఈ జిల్లా పశ్చిమ ఉత్తరప్రదేశ్‌తో పాటు ఎన్‌సీఆర్‌లో కీలకమైన అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంలో యూపీలో జరిగిన పరివర్తన గురించి మాట్లాడుతూ.. ప్రస్తుతం చెరకు, చక్కెర, ఇథనాల్ ఉత్పత్తిలో దేశంలోనే ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 2017లో రాష్ట్రంలోని చక్కెర మిల్లులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయని, కానీ బీజేపీ ప్రభుత్వం వాటిని విజయవంతంగా గట్టెక్కించిందని యోగి గుర్తుచేశారు. ప్రస్తుతం 122 చక్కెర మిల్లులు పనిచేస్తున్నాయని, చెరకు రైతులకు క్వింటాల్‌కు రూ.400 ధర అందుతోందని, చెల్లింపుల వ్యవస్థ కూడా గతంతో పోలిస్తే ఎంతో మెరుగుపడిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 1857 సిపాయిల తిరుగుబాటులో షామ్లీ, కైరానాల చారిత్రక పాత్రను, భారత శాస్త్రీయ సంగీతానికి ఈ ప్రాంతం అందించిన సేవలను సీఎం యోగి స్మరించుకున్నారు.

# భారత్‌పై ఫిర్యాదు.. ఖర్చు మొత్తం భరిస్తున్న పాక్

మొదటిపేజీ తరువాయి – ఒప్పందానికి సంబంధించిన వివాదంలో భారత్ విచారణను బహిష్కరించడంతో, మధ్యవర్తిత్వ ప్రక్రియ ఆగిపోకుండా ఉండేందుకు పాకిస్థానే రెండు దేశాల ఖర్చును భరిస్తోంది. ఇప్పటివరకు ఈ ప్రక్రియ కోసం ఆరు లక్షల డాలర్లకు పైగా అంటే సుమారు రూ.5.2 కోట్లకు పైగా వెచ్చించినట్లు నివేదికలు వెల్లడించాయి. విచారణ కొనసాగుతున్న కొద్దీ ఈ భారం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నాయి. సింధు జలాల ఒప్పందం ప్రకారం వివాదాలు తలెత్తితే మధ్యవర్తిత్వ వ్యయాన్ని భారత్, పాకిస్థాన్ సమానంగా భరించాలి. అయితే 2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉగ్రవాదానికి పాకిస్థాన్ పూర్తిగా చెక్ పెట్టే వరకు సింధు జలాల ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అదే సమయంలో ఈ వివాదానికి సంబంధించిన మధ్యవర్తిత్వ ప్రక్రియ నుంచి కూడా తప్పుకొంది. కిషన్‌గంగా, రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టులపై పాకిస్థాన్ పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించింది. ఈ ప్రాజెక్టుల రూపకల్పన ఒప్పందానికి విరుద్ధమని ఇస్లామాబాద్ వాదిస్తోంది. కానీ ఇది సాంకేతిక అంశమని, ఇలాంటి వివాదాలను కోర్టు కాకుండా తటస్థ నిపుణుడే పరిశీలించాలని భారత్ మొదటి నుంచీ చెబుతోంది. రెండు వ్యవస్థలు ఒకేసారి నడవడం ఒప్పంద నిబంధనలకు విరుద్ధమని కూడా స్పష్టం చేసింది. అంతర్జాతీయ మధ్యవర్తిత్వ నిబంధనల ప్రకారం ఒక పక్షం హాజరు కాకపోయినా ట్రైబ్యునల్‌కు అధికార పరిధి ఉందని భావిస్తే విచారణ కొనసాగించవచ్చు. అదే కారణంతో 'పర్మినెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్' పాకిస్థాన్ పిటిషన్‌పై విచారణ కొనసాగిస్తోంది. అయితే ఈ ట్రైబ్యునల్ చట్టబద్ధంగా ఏర్పడలేదని భారత్ చెబుతోంది. అందువల్ల ఆ కోర్టు ఇచ్చే ఎలాంటి తీర్పునూ తాము గుర్తించబోమని ఇప్పటికే స్పష్టం చేసింది. భారత్ విచారణకు హాజరు కాకపోయినా కేసును కొనసాగించాలంటే మొత్తం ఖర్చును పాకిస్థానే భరించాల్సి వస్తోంది. అందుకే తన వాటాతో పాటు భారత్ చెల్లించాల్సిన మొత్తాన్నీ ఇస్లామాబాద్ చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రూ.5.2 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు సమాచారం. విచారణ ఇంకా కొనసాగితే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పాకిస్థాన్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి 7 బిలియన్ డాలర్ల సహాయ ప్యాకేజీపై ఆధారపడుతోంది. పన్నుల పెంపు, సబ్సిడీల కోత, అప్పుల నియంత్రణ వంటి కఠిన షరతుల మధ్య ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఇలాంటి సమయంలో మధ్యవర్తిత్వ ఖర్చు కూడా పెరగడం పాకిస్థాన్‌పై అదనపు భారంగా మారింది.

# భారత్‌లో సరికొత్త శకం

మొదటిపేజీ తరువాయి – రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుంది. ఈ 10 కోచ్‌ల రైలు హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేసే ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. ఈ ఘనతతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది.

### రూ.12,470 కోట్లతో రహదారుల అభివృద్ధి

ఈ కార్యక్రమంతో పాటు హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.9,680 కోట్ల వ్యయంతో నిర్మించిన 158 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ–అమృత్‌సర్–కత్రా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ వల్ల ఢిల్లీ–కత్రా ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు, ఢిల్లీ–అమృత్‌సర్ ప్రయాణ సమయం 8 నుంచి 4 గంటలకు తగ్గనుంది. ఇది వైష్ణోదేవి యాత్రికులకు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అదేవిధంగా అంబాలా–కాలా అంబ్, జింద్–గోహానా జాతీయ రహదారులను కూడా జాతికి అంకితం చేశారు. జింద్–గోహానా రహదారి వల్ల ప్రయాణ సమయం రెండు గంటల నుంచి 40 నిమిషాలకు తగ్గనుంది. హన్సీ–బరవాలా రహదారి విస్తరణ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

### వైద్యం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట

కురుక్షేత్ర నగరంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిర్మించిన ఎలివేటెడ్ రైల్వే ట్రాక్‌ను కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది రైలు, రోడ్డు రవాణా వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచుతుంది. రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భివానీలోని పండిట్ నేకీ రామ్ శర్మ ప్రభుత్వ వైద్య కళాశాల, నార్నౌల్‌లోని మహర్షి చ్యవన్ మెడికల్ కాలేజీ, రావు తులారామ్ ఆసుపత్రిని జాతికి అంకితం చేశారు. ఈ సంస్థల ద్వారా హర్యానాలో వైద్య విద్య, ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు సిక్కు గురువుల చరిత్ర, వారి త్యాగాలు, దేశ సంస్కృతికి వారు అందించిన సేవలను ఆధునిక టెక్నాలజీతో ప్రదర్శించేందుకు కురుక్షేత్రలో నిర్మించనున్న సిక్కు మ్యూజియానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ హర్యానా సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రభుత్వం పేర్కొంది

# సౌదీ–ఇరాన్ల మధ్య నలిగిపోతున్న పాకిస్థాన్

మొదటిపేజీ తరువాయి – పాకిస్తాన్‌ను తీవ్ర సంకటంలోకి నెట్టాయి. ఒకవైపు ఇరాన్ అనుకూల హౌతీ రెబెల్స్ సౌదీ అరేబియా లక్ష్యంగా దాడులకు తెగబడుతుండటంతో.. తన చిరకాల మిత్రదేశమైన సౌదీకి, మరోవైపు పొరుగునే ఉన్న ఇరాన్‌కు మధ్య సమతుల్యతను కాపాడుకోవడానికి పాకిస్థాన్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అటు రక్షణ ఒప్పందాలను గౌరవిస్తూనే, ఇటు ప్రాంతీయ ఉద్రిక్తతలకు దూరంగా ఉండేందుకు ఇస్లామాబాద్ తెరవెనుక దౌత్య నీతిని వేగవంతం చేసింది.

### సౌదీ రక్షణపై తీవ్ర ఒత్తిడి

దశాబ్దాలుగా పాకిస్థాన్ ఆర్థికంగా, వ్యూహాత్మకంగా సౌదీ అరేబియాపైనే ఆధారపడి ఉంది. ఇరు దేశాల మధ్య ఉన్న పాత రక్షణ ఒప్పందాల ప్రకారం.. సౌదీ సార్వభౌమాధికారానికి ముప్పు వాటిల్లితే పాక్ సైన్యం అక్కడ రంగంలోకి దిగాల్సి ఉంటుంది. ప్రస్తుత హర్మూజ్ సంక్షోభం నేపథ్యంలో గల్ఫ్ దేశాలపై దాడులు పెరిగితే, సౌదీ చమురు క్షేత్రాలు, పవిత్ర నగరాల రక్షణ కోసం పాక్ దళాలను పంపాలంటూ రియాద్ నుంచి ఇస్లామాబాద్‌పై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది.

### ఇరాన్‌తో మధ్యవర్తిత్వమే ఏకైక మార్గమా?



సౌదీకి సైనిక సాయం అందిస్తే నేరుగా ఇరాన్‌తో శత్రుత్వాన్ని కొనితెచ్చుకున్నట్లు అవుతుందని పాకిస్థాన్ భయపడుతోంది. ఇప్పటికే సరిహద్దు వివాదాలు, ఉగ్రవాద ఆరోపణలతో ఇరాన్–పాక్ సరిహద్దులు అశాంతిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, ఇరాన్‌తో ఘర్షణ పడకుండా ఉండేందుకు ఇరుపక్షాల మధ్య మధ్యవర్తిత్వం వహించాలని పాక్ ప్రధాని భావిస్తున్నారు. టెహ్రాన్‌తో సంప్రదింపులు జరుపుతూ, హౌతీ దాడులను నియంత్రించేలా ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఒప్పించేందుకు పాక్ దౌత్యవేత్తలు రంగంలోకి దిగారు.

### ఆర్థిక భయాలు.. పాక్‌కు తప్పని తిప్పలు

పాకిస్థాన్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు ఆర్థిక సంక్షోభం. ఒకవేళ హర్మూజ్ జలసంధిలో యుద్ధం ముదిరి, చమురు సరఫరా నిలిచిపోతే గల్ఫ్ దేశాల నుంచి వచ్చే నిధులు ఆగిపోతాయి. అలాగే చమురు ధరలు పెరిగితే పాక్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దివాలా తీస్తుంది. అందుకే అటు గల్ఫ్ దేశాల రక్షణ బంధాన్ని తెంచుకోలేక, ఇటు ఇరాన్‌తో నేరుగా తలపడలేక పాకిస్థాన్ పిల్లిమొగ్గలు వేస్తోంది. పశ్చిమాసియా సంక్షోభంలో పాక్ తీసుకునే ఏ చిన్న నిర్ణయమైనా ఆ దేశ భవిష్యత్తును మార్చేసే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మనం
శనివారం 18-07-2026

# STU టెట్ హ్యాండ్ బుక్ విడుదల చేసిన నాయకులు



**ఎమ్మిగనూరు, జూలై,17,ప్రభ మనం:** రాష్ట్రోపాధ్యాయ సంఘం (STU) రాష్ట్ర అకడమిక్ కమిటీ వారు వర్షా కోచింగ్ సెంటర్ వారి సహకారంతో తయారుచేసిన టీచర్ టెట్ హ్యాండ్ బుక్ ను ఎస్ టి యు ఎమ్మిగనూరు తాలూకా కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీ అడివన్న గారు విడుదల చేశారు ఈ పుస్తకంలో సైకాలజీ, తెలుగు, ఇంగ్లీష్ మరియు మెథడాలజీ సంబంధించి ఇంపార్టెంట్ బుల్లెట్ పాయింట్స్ సంకలనం చేసి రూపొందించిన పుస్తకం ఇది. అలాగే సైన్స్ కు సంబంధించి గణితానికి సంబంధించి కొన్ని పట్టికలు కూడా ఇందులో ఇవ్వబడినవి. మొత్తంగా ఈ పుస్తకం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, టెట్ పరీక్షలో మంచి మార్కులు సులభంగా సంపాదించుకోవచ్చు అని తెలిపారు. స్పెషల్ టెట్ కు సూటబుల్ టీచర్ హ్యాండ్ బుక్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, బసవరాజు, ప్రసన్నరాజు మరియు బాబయ్య, చంద్రశేఖర్, యల్లప్ప, సిద్ధలింగమూర్తి, తిమ్మరాజు, తులసి రామ్, నారాయణరెడ్డి, చిన్నతిమ్మన్న, లక్ష్మన్న పాల్గొన్నారు

# పంటల బీమాపై జులై 31 వరకు గడువు పొడిగింపు...!!

**మండల రైతులకు మండల వ్యవసాయ అధికారిని సుచరిత వెల్లడి**



**పెద్దకడబూరు జులై 17 ప్రభ మనం:** మండల కేంద్రమైన పెద్దకడబూరులో స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం రైతులకు ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని సుచరిత రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ,ఖరీఫ్ -- 2026 వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (=ఔదీజ×ూ) క్రింద లోనీ మరియు నాన్-లోనీ రైతుల నమోదు గడువును 31-07-2026 వరకు పొడిగించడం జరిగిందన్నారు. అలాగే ఇప్పటి వరకు పంటల బీమాలో నమోదు చేసుకోని అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 31-07-2026 లోపు సంబంధిత బ్యాంకు లేదా కామన్ సర్వీస్ సెంటర్ సి ఎస్ సి ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకోవలసిందిగా కోరడమైనది.- 16-07-2026 నుండి 31-07-2026 మధ్య నమోదు చేసుకునే రైతులకు బీమా రక్షణ 01-08-2026 నుండి మాత్రమే అమలులో ఉంటుంది - 01-07-2026 నుండి 31-07-2026 వరకు జరిగిన వాతావరణ నష్టాలకు బీమా రక్షణ లేదా క్లెయిమ్ వర్తించదు. అర్హులైన రైతులందరూ చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే నమోదు పూర్తి చేసుకొని పంటల బీమా రక్షణను పొందాలని మండల గ్రామీణ ప్రజలకు తెలియజేశారు....

# గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి

**తహాశీల్దార్ కే. రమాదేవి**




**మంత్రాలయం , జూలై 17,మనం న్యూస్** ;- గ్రామంలో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తాసిల్దార్ రమాదేవి తెలిపారు. శుక్రవారం మంత్రాలయం మండల పరిధిలోని వగరూరు గ్రామంలో ఉన్న సచివాలయంలో గ్రామ సభలో భాగంగా వన్ మంత్, వన్ విలేజ్ ఫోర్ విజిట్ అనే కార్యక్రమం నిర్వహించారు. చాలామంది రైతులు రి సర్వే సందర్భంగా జరిగిన భూ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు సమర్పించారు. గ్రామంలో డ్రైనేజీ తాగు నీరు రోడ్డు సమస్యల గురించి అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. అలాగే సచివాలయం ప్రక్కన నిర్మించిన అంగన్వాడి సెంటర్ కూడా పూర్తి కాలేదని అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్ ఏపిఓ భక్తవత్సలం, పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య, వైద్యాధికారి సంతోష్ కుమార్ , వ్యవసాయ ఏఈఓ లు తిరుమలరెడ్డి, ప్రతాప్, వీఆర్వో ప్రభాకర్ , పంచాయతీ కార్యదర్శి దశరథ్, టిడిపి నాయకులు పవన్ కుమార్, లింగప్ప, అబ్దుల్ ,సచివాలయ సిబ్బంది,పాల్గొన్నారు

# మెలిగనూరులో బీహార్ దొంగలు!



**మనం న్యూస్ కౌతాళం జూలై 17:** కౌతాళం మండలం మ్యాలిగనూరు గ్రామంలో గురువారం ఇద్దరు వ్యక్తులు బీహార్ రాష్ట్రానికి చెందిన వారమని చెప్పుకుంటూ గ్రామంలోకి వచ్చారు. ఇంటింటికీ తిరుగుతూ, పాత బంగారం, వెండి ఆభరణాలను ప్రత్యేక రసాయనాలతో శుభ్రం చేసి కొత్తవిగా మార్చి ఇస్తామని ప్రజలను నమ్మించారు. వారి మాటలు నమ్మిన కొందరు మహిళలు ఇంట్లో ఉన్న వెండి వస్తువులు, చిన్నపిల్లల వెండి కడాలు, ఇతర ఆభరణాలను శుభ్రం చేయడానికి వారికి ఇచ్చారు. వారు వాటిని నీటిలో వేసి శుభ్రం చేసినట్లు నటించి తిరిగి యజమానులకు అప్పగించారు. అయితే, ఆభరణాలను పరిశీలించిన తర్వాత వాటి బరువు తగ్గడం, కొంత భాగం కరిగిపోయినట్లు గుర్తించిన బాధితులు వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు అప్రమత్తమై ఆ ఇద్దరిని పట్టుకుని విచారించగా, ఇదే విధంగా మోసాలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. విచారణలో వారు బీహార్ రాష్ట్రానికి చెందిన వారని తెలిసిన గ్రామస్తులు వెంటనే కౌతాళం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి, వారిని పోలీసులకు అప్పగించారు. ఇలాంటి వ్యక్తుల మాటలు నమ్మి బంగారం, వెండి ఆభరణాలను అపరిచితులకు ఇవ్వొద్దని, అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామ పెద్దలు, పోలీసులు ప్రజలకు సూచించారు.

# వైభవంగా సుశీలేంద్ర తీర్థుల ఆరాధన వేడుకలు



**మంత్రాలయం, జూలై 17,:** కర్నాటక రాష్ట్రం, హొసరిత్తి లో వెలసిన సుశీలేంద్ర తీర్థుల ఆరాధన వేడుకలు మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థుల అధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆరాధన పురస్కరించుకుని సుశీలేంద్ర తీర్థుల బృందావనాన్నికి, శ్రీ మఠం పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థులు విశేష పంచామృతాభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా రూపొందించిన బంగారు కవచాలను సుశీలేంద్ర తీర్థుల బృందావనానికి సమర్పించారు. సంస్థాన పూజల్లో భాగంగా శ్రీ మూల రామ దేవతలకు, శ్రీ నరసింహ స్వామి ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. సులేంద్ర తీర్థుల ఆరాధన ను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ఫల మంత్రాక్షితలు ఇచ్చి , ముద్రాధారణ చేసి ఆశీర్వదించారు.

# ప్రజల దాహం తీర్చేందుకు బుట్టా ఫౌండేషన్ తక్షణ స్పందన



**ఎమ్మిగనూరు,జూలై,17,ప్రభ మనం:** మండలంలోని కడివేళ్ల గ్రామంలో గ్రామ చెరువు నుంచి పంపింగ్ హౌస్ ద్వారా జరిగే తాగునీటి సరఫరా వ్యవస్థలో సాంకేతిక అంతరాయం ఏర్పడటంతో గత నెల రోజులుగా గ్రామ ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గ్రామ ప్రజల తరపున మాజీ సర్పంచ్ శ్రీ కృష్ణ గారు, శ్రీ ఉరుకుందు గౌడ్ గారు, శ్రీ సుదర్శన్ గౌడ్ గారు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బుట్టా రేణుక గారి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న శ్రీమతి బుట్టా రేణుక గారు వెంటనే స్పందించి, బుట్టా ఫౌండేషన్ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠ గారికి విషయం తెలియజేశారు. ప్రజల అవసరమే ప్రథమ ప్రాధాన్యమనే భావనతో స్పందించిన బుట్టా శివ నీలకంఠ గారు తక్షణమే ఆదేశాలు జారీ చేసి, బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడివేళ్ల గ్రామానికి మంచినీటి ట్యాంకర్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించే ఏర్పాట్లు చేయించారు. దీంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలకు తక్షణ ఉపశమనం లభించింది. సమస్య తీవ్రతను అర్థం చేసుకుని ఎలాంటి ఆలస్యం లేకుండా స్పందించి సేవలు అందించిన శ్రీమతి బుట్టా రేణుక గారికి, శ్రీ బుట్టా శివ నీలకంఠ గారికి గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాన్ని గుర్తించి, ప్రభుత్వ వ్యవస్థ ద్వారా సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ప్రత్యామ్నాయంగా మంచినీటిని అందించడం బుట్టా ఫౌండేషన్ సేవా దృక్పథానికి నిదర్శనమని కొనియాడారు. ప్రజా సేవను బాధ్యతగా భావిస్తూ, సమస్య వచ్చిన తర్వాత కాదు... సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకుండా ముందుగానే స్పందించడం బుట్టా ఫౌండేషన్ ప్రత్యేకత. అవసరంలో అండగా, ఆపదలో తోడుగా నిలుస్తూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న బుట్టా ఫౌండేషన్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకుని ప్రజల మన్ననలు పొందింది.

# బడి పిల్లలు బడి బస్సు కు అవస్థలు...!!

**బస్సు ఫుల్... రోడ్డుపైనే విద్యార్థులు..??**

**స్కూల్ సయానికి మరొక బస్సు నడపండయ్య విద్యార్థులు ఆవేదన**




**పెద్దకడబూరు జూలై 17 ప్రభ మనం:** మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఆయా పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు నిత్యం ఉదయం,ఆయా పాఠశాలకు సయానికి చేరుకోవాలంటే ఇదే బస్సు ఎక్కాల్సిందే అని విద్యార్థులు శుక్రవారం అవస్థలు పడుతున్న తీరును "ప్రభ మనం" రిపోర్టర్ కు తమ మొరను వినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థిని,విద్యార్థులు తెలియజేస్తూ ఉదయం బడికి చేరాలంటే నానా అవస్థలు పడి బడి బస్సు ఎక్కాలని. సాయంత్రం పాఠశాల నుంచి బస్సు కోసం ఎదురుచూపులు చూసి బస్సు నిండా బడి పిల్లలు ఉన్న నిలబడి ప్రయాణం చేయవలసి దుస్థితి మాకు ఏర్పడిందని విద్యార్థులు తెలియజేశారు. సమయానికి ఊరుకు చేరకపోతే నైట్ ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి మాకు ఏర్పడుతుందని పాఠశాల విద్యార్థులు ఆవేదన విన్నవించుకున్నారు. ఎప్పుడు ఏ అపాయం జరుగుతుందో అని భయాన్ని గుప్పట్లో పెట్టుకొని బస్సు ఎక్కాల్సిన పరిస్థితి మాకు ఉందని వారన్నారు. బస్సు పూర్తిగా నిండిపోయిన కాళ్లపైనే నిలబడి ఊరికి చేరాల్సిన పరిస్థితి అని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులు డిపో మేనేజర్ కు తెలియజేస్తూ అయ్యా ప్రతిరోజు ఉదయం సాయంత్రం పూర్తిగా బస్సు నిండిపోతుందని మేము బడికి చేరాలంటే నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి మాకుందని దయచేసి మరొక అదనపు బస్సును మా పాఠశాలలకు వెళ్లే సమయానికి ఏర్పాటుచేసి మేము పడుతున్న ఇబ్బందులను మీరు గుర్తించి మాకు సహకరించాలని విద్యార్థిని విద్యార్థులు డిపో మేనేజర్ కు తమ ఆవేదనను విన్నవించుకున్నారు.

# చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్యలు చేసుకోవడం మంచిది కాదు

**జీవితం చాలా విలువైనది**

**మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు**





**మంత్రాలయం , జూలై 17,మనం న్యూస్ ;-** అమ్మాయిలు చిన్న చిన్న విషయాలకే క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోకూడదని ఆత్మహత్య చేసుకొనే ముందు జీవితం గురించి ఆలోచించాలని మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు విద్యార్థులు పిలుపునిచ్చారు. శుక్రవారంఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని మాధవరం లోని జెడ్పీహెచ్ హైస్కూల్ విద్యార్థులు బాల్య వివాహాలు , సైబర్ నేరాలు పై మాధవరం విజయ్ కుమార్ తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు అన్ని రంగాల్లో అవకాశాలు ఉన్నాయి. మంచిగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. చిన్న పిల్లలపై మరియు మహిళలపై జరిగే నేరాలు, ఇవ్వటిజింగ్ గురించి వాటికి వున్న శిక్షల గురించి, తెలియజేయడమైనది. బాల్య వివాహాలు చేయరాదని , అలా చేస్తే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి తెలియజేయడమైంది. మైనర్ లు వాహనాలు నడుపరాదు అని తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని అలా చేస్తే చట్ట ప్రకారం జైలు శిక్ష మరియు జరిమానా విధించబడును. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణించరాదు. స్కూల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు ఉన్నారు.

# అంత్యోదయ కుటుంబాల హక్కులపై కోతలు వద్దు

**ప్రతి కార్డుకు 35 కిలోల రేషన్ యథాతథంగా ఇవ్వాలి**

**సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు డిమాండ్**

**తుగ్గలి, జూలై 17 ( ప్రభ మనంన్యూస్):** అంత్యోదయ అన్న యోజన పథకంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త విధానాన్ని వెంటనే ఉపసంహరించుకొని, ప్రస్తుతం అమలులో ఉన్న విధంగానే ప్రతి కార్డుకు నెలకు 35 కిలోల రేషన్‌ను కొనసాగించాలని సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, దేశంలోని అత్యంత పేద, నిరుపేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించేందుకు రూపొందించిన అంత్యోదయ పథకాన్ని బలహీనపరిచేలా కొత్త విధానం ఉందని విమర్శించారు. ప్రస్తుతం కుటుంబంలో సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ఏఏవై కార్డుకు నెలకు 35 కిలోల బియ్యం అందజేస్తున్నారని తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం వ్యక్తికి 7 కిలోల చొప్పున రేషన్ కేటాయించే విధానాన్ని తీసుకురావాలని యోచిస్తోందని, దీని వల్ల ఐదుగురు కంటే తక్కువ సభ్యులు ఉన్న కుటుంబాలకు రేషన్ పరిమాణం తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ మార్పు వల్ల అత్యంత పేద కుటుంబాల ఆహార భద్రత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద ప్రజల జీవన వ్యయం రోజురోజుకూ పెరుగుతున్న పరిస్థితుల్లో రేషన్‌లో కోతలు విధించడం అన్యాయమని శ్రీరాములు పేర్కొన్నారు. అంత్యోదయ పథకం లక్ష్యం ఆకలి నిర్మూలన, పేద కుటుంబాలకు కనీస ఆహార భద్రత కల్పించడమేనని, ఆ లక్ష్యానికి విరుద్ధంగా ఉండే ఎలాంటి మార్పులనైనా కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు.



రేషన్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో లబ్ధిదారులపై భారం మోపే విధానాలను అమలు చేయడం సరైంది కాదన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి అంత్యోదయ కార్డుకు యథావిధిగా నెలకు 35 కిలోల రేషన్‌ను కొనసాగించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచి, అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి పేదల ప్రయోజనాలను కాపాడాలని శ్రీరాములు విజ్ఞప్తి చేశారు.

# తుగ్గలి విద్యార్థినుల ప్రతిభకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

**షైనింగ్ స్టార్ అవార్డుకు కేజీబీవీ ఇద్దరు విద్యార్థినుల ఎంపిక**



**తుగ్గలి, జూలై 17 ( ప్రభ మనం న్యూస్):** తుగ్గలి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)కి చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే "షైనింగ్ స్టార్" అవార్డుకు ఎంపికై తుగ్గలి మండలానికి గర్వకారణంగా నిలిచారు. శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ విడపనకల్లు షాహీన్ విలేకరులతో మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కే. జోష్ణ (600కు 560 మార్కులు), రమావత్ స్వాతి (600కు 534 మార్కులు) షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ అవార్డు కింద ప్రతి విద్యార్థినికి రూ. 20 వేల నగదు ప్రోత్సాహకం, మెమెంటో, ప్రశంసాపత్రాన్ని జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా త్వరలో అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థినుల ఈ విజయం వారి కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారానికి నిదర్శనమని ప్రిన్సిపాల్ షాహీన్ పేర్కొన్నారు. అలాగే తుగ్గలి మండలానికి చెందిన మరికొందరు విద్యార్థులు కూడా షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం సంతోషకర విషయమని తెలిపారు.

# కరెంట్ షాక్‌తో మహిళ దుర్మరణం జొన్నగిరిలో విషాదం



**తుగ్గలి, జూలై 17 ( ప్రభ మనం న్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జొన్నగిరి గ్రామంలో శుక్రవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపురం గ్రామానికి చెందిన తలారి అనిత (34), భర్త దివంగత బాల ఆంజనేయులు. ఆమె తన తల్లిదండ్రుల గ్రామమైన జొన్నగిరిలో ఉండగా, మధ్యాహ్నం ఇంటి వద్ద బట్టలు ఉతుకుతున్న సమయంలో నీటి మోటార్ ఆన్ చేసేందుకు కరెంట్ బోర్డు నుంచి మోటార్‌కు ఉన్న ప్లగ్‌ను ప్లగ్ బాక్స్‌లో అమర్చే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతి చెందిన అనితకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మనం
TELUGU DAILY



# కాళేశ్వరం నుంచి బనకచర్ల దాకా..



రాజమండ్రి.. ఈ పేరు తెలుగువారిలో ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక భావనను కలిగిస్తుంది. ఇది తెలుగు సినిమాల ప్రభావం వల్ల కావచ్చు. కానీ, వాస్తవానికి కొబ్బరి చెట్లు, పచ్చటి పొలాలు, ప్రవహించే కాలువలు, నీళ్ల ప్రవాహాన్ని నియంత్రించే పాత లాకులతో ఈ ప్రాంతం ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. మరీ ముఖ్యంగా ఇక్కడి ప్రజల మాటకారితనం, ఆత్మస్థైర్యం కట్టిపడేస్తాయి. సినిమాల్లో ఈ ప్రకృతి రమణీయత ఒక మాయజాలంలా కనిపిస్తుంది. రాజమండ్రి అనగానే మనకు వెంటనే గుర్తుకువచ్చేది.. నిండుగా పారే గోదావరి, ఆ నదిపై విస్తరించిన ఐదు కిలోమీటర్ల పొడవైన రైల్వే బ్రిడ్జి. ఒక్క మాటలో చెప్పాలంటే, మనుషులు, ప్రకృతి మధ్య ఉన్న ఆధ్యాత్మిక అనుబంధానికి ఈ ప్రాంతం ప్రతీక అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణానికి ముందు ఉభయ గోదావరి జిల్లాలు దుర్భిక్ష ప్రాంతాలుగా ఉండేవి. అభివృద్ధికి దూరంగా ఉండే ఈ ప్రాంతాలు తరచూ కరువు, వరద ప్రభావానికి గురయ్యేవి. 183233లో తీవ్రమైన కరువు, ఆ తర్వాత 183538 మధ్యకాలంలో వరుసగా మూడేండ్లు కరువు, 1839లో తుఫాను, ఆ తర్వాత సంవత్సరాల్లో కూడా విపత్తులు ఆ ప్రాంతాన్ని అతలాకుతలం చేశాయి. వరుస కరువులు, విపత్తుల కారణంగా ఆహారం లేక నిరాశ్రయులై ఆ ప్రాంతంలోని మూడో వంతు ప్రజలు మరణించారు. ఈ కాలాన్ని చరిత్రకారులు 'డొక్కల కరువు'గా (శరీరంలో మాంసం లేకుండా కేవలం ఎముకలు కనిపించే స్థితి) పేర్కొంటారు. ఆ కాలంలో బతుకడానికి పిల్లలను కొన్ని అణాలకే అమ్మేవారని ఒక సందర్భంలో సర్ ఆర్థర్ కాటన్ కుమార్తె ఎలిజబెత్ రీడ్ కాటన్ (లేడీ హోప్) చెప్పారు. ఈ దుస్థితికి విరుద్ధంగా నేడు గోదావరి డెల్టా అత్యంత సారవంతమైన, వ్యవసాయ ఉత్పాదకత కలిగిన ప్రాం తంగా మారింది. ఇది సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ధవళేశ్వరం ఆనకట్ట వల్లే సాధ్యమైంది. 1847లో ప్రారంభించి, 1852లో పూర్తయిన ఈ ఆనకట్ట ప్రజలను ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడటమే కాకుండా ఆధునిక సాగునీటి వ్యవస్థకు బాటలు వేసింది. ఆయనను ఇప్పటికీ అక్కడి ప్రజలు ఆరాధిస్తారు.

అయితే, విమర్శనాత్మక దృష్టితో చూస్తే కాటన్ ఈ ఆనకట్టను బ్రిటిష్ ప్రభుత్వ ప్రయోజనాల కోసం నిర్మించారని భావించవచ్చు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి భూమి శిస్తు ద్వారా ఆదాయాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యమని.. కరువు నివారణ, ఈ ప్రాంత అభివృద్ధి ద్వితీయ లక్ష్యాలని విమర్శకులు అంటారు. రాజమండ్రి దగ్గర గోదావరి నది ఏడాది పొడవునా నిండుగా ప్రవహించడానికి ధవళేశ్వరం ఆనకట్ట కారణం. ఇది రాజమండ్రి నుంచి సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆ ఆనకట్ట లేకుంటే ఒక్కసారి ఆ ప్రాంతాన్ని ఊహించుకోండి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమంటే.. తెలంగాణ అంతటా గోదావరిపైన ఇలాంటి బ్యారేజీలను నిర్మించి ఉంటే రాజమండ్రి వంటి అనేక సాంస్కృతిక కేంద్రాలతో తెలంగాణ విలసిల్లేది. అయితే, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా బ్యారేజీలు నిర్మించినప్పటికీ, అవి రాజకీయ క్రీడలో పావులుగా మారడం తెలంగాణ చేసుకున్న దురదృష్టకరం. తెలంగాణకు దక్కాల్సిన గోదావరి జలాలు రాజకీయాల వల్ల తెలంగాణ రైతాంగానికి అందకపోవడం మన దౌర్భాగ్యం. ఇక్కడ ఇంకో ఉదాహరణ కూడా చెప్పుకోవాలి. అది ఉమ్మడి ఏపీలో నిర్మించిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్. దీన్ని నిర్మించకముందు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు కరువుతో అల్లాడేవి. ఆ జిల్లాల ప్రజలు తక్కువ జీవన ప్రమాణాలతో బాధపడేవారు. గోదావరి జిల్లాలతో పోలిస్తే ఈ జిల్లాల రాజకీయ, సాంస్కృతిక ప్రాబల్యం కూడా చాలా తక్కువ. అయితే, ఈ ప్రాజెక్టును నిర్మించాక ఈ జిల్లాలు సామాజిక, ఆర్థికపరంగానే కాదు, రాజకీయపరంగానూ అసాధారణమైన వృద్ధి సాధించాయి.

ఈ ప్రాంతం అభివృద్ధి ప్రధానంగా కుల రాజకీయాలు, మీడియా, చలనచిత్ర పరిశ్రమలో కులాధిపత్యానికి దారితీసింది. కాళేశ్వరం, బనకచర్లపై నేడు చర్చ జరుగుతున్న నేపథ్యంలో ధవళేశ్వరం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పోలిక, వాటి వల్ల జరిగిన మార్పులపై చర్చించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. నీటిపారుదల ప్రాజెక్టులు ఆ ప్రాంత ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరచడమే కాకుండా, రాజకీయ ప్రాబల్యాన్ని, సాంస్కృతిక ఆధిపత్యాన్ని పెంచడానికి కూడా దోహదపడతాయి. ధవళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఆర్థికంగా ఎదిగిన ఉభయ గోదావరి జిల్లాలు మద్రాస్-ఆంధ్ర రాజకీయాలను ప్రభావితం చేయగా, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చెందిన కృష్ణా-గుంటూరు జిల్లాలు ఉమ్మడి ఏపీ రాజకీయాలను శాసించాయి. ఉభయ గోదావరి జిల్లాలు గాని, కృష్ణా-గుంటూరు జిల్లాలు గాని ఆయా ప్రాంతాల్లో నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించకముందు తెలంగాణలోని ఏ ఒక్క జిల్లా కంటే కూడా ముందంజలో లేవనే విషయాన్ని తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతులు గుర్తించాలి. ఖర్చు లేకుండా సాగు నీరు లభ్యమవడంతో ఈ జిల్లాల్లో వ్యవసాయం లాభసాటిగా మారింది. వ్యవసాయంలో వచ్చిన 'మిగులు' ద్వారా వారి రాజకీయ ఆధిపత్యం పెరిగింది. నీటిపారుదల ప్రాజెక్టులు లేకుండా రాజకీయ నాయకత్వం బలపడదు. ఈ కోణంలో ఆలోచిస్తే కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చూపెట్టడం ఒక రాజకీయ వ్యూహంగా కనిపిస్తున్నది. కాళేశ్వరంపై లేనిపోని ఆరోపణలు చేయడం, దుష్ప్రచారం చేయడం, తద్వారా దానిపై నిరర్థక ప్రాజెక్టుగా ముద్ర వేసి తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం వారి మొదటి లక్ష్యం. రెండవది, ఆర్థికంగా ఎదగకుండా చేసి తెలంగాణపై వెనుకబడిన ప్రాంతంగా ముద్రవేసి, ఇక్కడి ప్రజలను శాశ్వతంగా ఆత్మన్యూనతాభావంలో ఉంచడం.

ఇక బనకచర్ల విషయానికి వద్దాం. బనకచర్ల ప్రాజెక్టు నిర్మించనున్న ప్రాంతం, అంతర్-బేసిన్ జలాల మళ్లింపు, ఈ ప్రాజెక్టు ప్రతిపాదిత సమయంపై తెలంగాణవాదులు ఎక్కువగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'మిగులు జలాలు' అనే భావనను తెలంగాణ నీటిపారుదల ఇంజినీర్లు వ్యతిరేకిస్తున్నారు. చివరి ప్రాజెక్టును దాటిన తర్వాత నదిలో లభ్యమయ్యే నీటిని 'మిగులు'గా పరిగణించాలని ఇంజినీర్లు వాదిస్తున్నారు. ఈ లెక్కన గోదావరి విషయంలో ధవళేశ్వరం బ్యారేజీని దాటిన తర్వాతే పారే జలాలలను మిగులుగా పేర్కొనాలి. అందువల్ల మిగులు జలాలపై ఆధారపడి నిర్మించే ఏ ప్రాజెక్టు అయినా ధవళేశ్వరం దిగువన ఉండాలే తప్ప, ఎగువన కాదని వారు వాదిస్తున్నారు. అట్లాగే, ఎగువ ఉన్న నదీ పరీవాహక తీర రాష్ట్రాల అవసరాలు పూర్తిగా తీర్చకుండా అంతర్-బేసిన్ మళ్లింపు జరగకూడదని వారు గట్టిగా వాదిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకుల పుణ్యమాని తెలంగాణలో దశాబ్దాల తరబడి గోదావరి ఎండిపోయింది. గోదావరి వల్ల తెలంగాణకు ఇసుమంతైనా ప్రయోజనం కలగలేదు. అందుకే, స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం తన సాగు, తాగునీటి అవసరాలను తీర్చుకునేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. ప్రస్తుతం కాళేశ్వరం చుట్టూ జరుగుతున్న పరిణామాలు, రాజకీయ వివాదాలన్నీ పలు అనుమానాలను లేవనెత్తుతున్నాయి. గోదావరి నీటిని ఇలాగే వదిలేయడం ద్వారా ఏపీకి లబ్ధి చేకూర్చడం, ఇతర నదీ బేసిన్లకు జలాలను తరలించడం దీని వెనుక ఉన్న ఉద్దేశమని తెలుస్తున్నది. తమిళనాడులో ఓట్లు కొల్లగొట్టడానికి బనకచర్ల ద్వారా పెన్నా, తూతపూర్ఖు బేసిన్లకు గోదావరి నీటిని మళ్లిస్తున్నట్టయితే తెలంగాణకు జరిగే నష్టం అంతా ఇంతా కాదు. అది తరతరాలకు శాపంగా మారుతుంది. ఎందుకంటే పోతిరెడ్డిపాడు ఉదాహరణ మన కండ్లముందే ఉన్నది. కాళేశ్వరం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అణా పైసా ఇవ్వలేదు. అయినా తెలంగాణ ప్రభుత్వమే పూర్తిగా తన సొంత వనరులతో ఈ ప్రాజెక్టును నిర్మించుకున్నది. నయా పైసా ఇవ్వకపోగా కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు కాళేశ్వరం ద్వారా తెలంగాణకు అందుతున్న నీటిని ఇతర రాష్ట్రాల ప్రయోజనాల కోసం మళ్లించాలని చూస్తున్నది. తెలంగాణ జలాల విషయంలో 'అమ్మ పెట్టదు అడుక్కుతిననివ్వదుట' అన్నట్టుగా కేంద్రం వ్యవహరిస్తున్నది.

బనకచర్లకు సంబంధించి మరో అతిపెద్ద సమస్య ఏమంటే.. పక్షపాత ధోరణిని అవలంబిస్తున్న మీడియా, వాటిలో వస్తున్న కథనాలు. ఈ మీడియా ఎలాంటిదో అర్థం చేసుకునేందుకు కాళేశ్వరం విషయంలో జరిగిన విమర్శలు, దుష్ప్రచారమే చక్కని ఉదాహరణ. ఆర్థికంగా ఈ ప్రాజెక్టు సాధ్యపడుతుందా? ఆర్థిక భారం, స్థిరత్వం, పర్యావరణానికి జరిగే నష్టం, ప్రాజెక్టు వల్ల ముంపు, అటవీ సంరక్షణ, ముఖ్యంగా తెలంగాణకు నీళ్లు ఎందుకు అవసరమనే ప్రాథమిక ప్రశ్న సహా అనేక అంశాలపై దుష్ప్రచారం చేస్తూ ఈ మీడియా ప్రశ్నలు లేవనెత్తింది. తెలుగు, ఇంగ్లిష్ ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో ఇలాంటి ప్రశ్నలతో కూడిన కథనాలే ఎక్కువగా కనిపించాయి. ప్రధానమైన ప్రశ్నలు ఏమంటే.. నీళ్లను లిఫ్ట్ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అంతగా ఖర్చు చేస్తున్నది? అందుకు అవసరమైన విద్యుత్తు భారాన్ని ఎందుకు మోయాలి? తెలంగాణను తరతరాలుగా కరువు ప్రభావిత ప్రాంతంగా ఉంచాలనుకోవడమే వారి ఉద్దేశమని సుస్పష్టం. పెరిగిన నీటిపారుదల వసతి అధిక వరి సాగుకు దారితీస్తుందని, తద్వారా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు పెరుగుతాయని కొందరు నిపుణులు వాదించడం విడ్డూరం. అటవీ భూములు మునిగిపోవడాన్ని ప్రస్తావిస్తూ పర్యావరణ ఆందోళనలను లేవనెత్తారు. అయితే, ఎక్కడ కూడా ఉమ్మడి ఏపీలో తెలంగాణ దశాబ్దాలుగా ఎదుర్కొన్న నిర్లక్ష్యం గురించి గాని, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా గురించి గాని ప్రస్తావించలేదు. తెలుగు, ఆంగ్ల మీడియాలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సమర్థిస్తూ ఒక్క కథనం కూడా ప్రచురితం కాలేదు. దీంతో జాతీయ ఆంగ్ల మీడియాలోనూ ఇలాంటి కథనాలే వచ్చాయి. నేటికీ కాళేశ్వరం వల్ల తెలంగాణలో జరిగిన మార్పు గురించి దేశ ప్రజలకు తెలియదు. ఈ ప్రతికూల ప్రచారం జాతీయ నిపుణులు, కేంద్ర పాలనా యంత్రాంగం, ట్రిబ్యునళ్లు, ఇతర వర్గాల వరకు అంతకంతకూ వ్యాపించింది. ధవళేశ్వరం లేదా నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల ప్రభావం నీళ్లకు అతీతంగా ఉంటుంది. అది మేధో మూలధనాన్ని సృష్టిస్తుందని గుర్తించడం చాలా ముఖ్యం. తెలంగాణ విషయంలో కాళేశ్వరానికి మద్దతిచ్చే నిపుణులు, మేధావుల గొంతుకలు జాతీయ చర్చలో చాలా తక్కువగా వినిపించాయి. పక్షపాత మీడియా సంస్థలు వారి గొంతుకలను నొక్కివేశాయి. అందుకే దుష్ప్రచార కథనాలు ఈ చర్చలో ఎక్కువగా ఆధిపత్యం చెలాయించాయి. ఇప్పుడు బనకచర్ల విషయానికి వద్దాం. నేడు దేశంలో ఎక్కువగా వినిపిస్తున్న మాట బనకచర్ల. ఆ ప్రాజెక్టు ఆర్థికంగా సాధ్యపడుతుందా? దాని ఆర్థిక భారం మాటేమిటి? నదీ పరీవాహక ప్రాంతం వెలుపల నీళ్లను ఎందుకు మళ్లిస్తున్నారు? అంత అత్యవసరం ఏమొచ్చింది? అని తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతాంగం నిలదీస్తున్నది. కాళేశ్వరం విషయంలో తీవ్ర చర్చనీయాంశమైన నీటిని ఎత్తిపోసే ఖర్చు గురించి ఇప్పుడు ఏ ఒక్క మేధావి కూడా గొంతు పెగలడం లేదు. పర్యావరణ సమస్య ఇప్పుడు అకస్మాత్తుగా తక్కువ ప్రాధాన్యాంశంగా మారిపోయింది. ప్రతిపాదిత పైప్‌లైన్లు నల్లమల అటవీ ప్రాంతం నుంచి వెళ్తాయి. దాని వల్ల సున్నితమైన పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటుంది. భారీ జలాశయాల నిర్మాణం వల్ల అక్కడి స్థానికులు నిరాశ్రయులవుతారు. కాళేశ్వరంపై విమర్శలు గుప్పించిన న్యాయ నిపుణులు, విద్యావేత్తలు, హక్కుల కార్యకర్తలు సహా పౌర సమాజం ఇప్పుడు బనకచర్ల విషయంలో మౌనం దాల్చడం ఆందోళనకరం. ఈ గొంతుకలన్నీ మూగబోవడంతో బనకచర్ల పట్ల తెలంగాణ అభ్యంతరాలను నొక్కిపెట్టడం ద్వారా ఒక వర్గం మీడియా పక్షపాత ధోరణిని అవలంబిస్తున్నది. బనకచర్ల విషయంలో ఇలాంటి ఆందోళనలను లేవనెత్తితే వాటిని అభివృద్ధి నిరోధకులుగా అభిప్రాయాలుగా, రాజకీయ ప్రేరేపితమైనవిగా ఈ మీడియా తోసిపుచ్చుతున్నది.

ఇప్పుడు కూడా తెలంగాణకు బనకచర్ల ఏ విధంగా నష్టం చేస్తుందో తెలియజేయకుండా దాని వల్ల ఆంధ్రకు కలిగే ఉపయోగాల గురించి ఎక్కువగా ప్రస్తావిస్తున్నది. అదీ తెలంగాణ ఎడిషన్లలో. ఇది బానిస మనస్తత్వాలపై ప్రయోగించే సాధనం. తన అవసరాలు, తను ఏం కోల్పోతున్నాడో బానిసకు తెలియకుండా దాచిపెట్టి.. యజమాని, ఆయన కుటుంబ అవసరాలను ప్రముఖంగా చూపెట్టే ప్రయత్నంలో బానిసను త్యాగాల దిశగా నడిపించే ప్రయత్నం జరుగుతుంది. పోతిరెడ్డిపాడు విషయంలో అదే జరిగింది. ఇప్పుడు బనకచర్ల విషయంలో అదే జరుగుతున్నది.

మహబూబ్ నగర్, నల్లగొండ, ఖమ్మం రైతులను విస్మరించి కరువు జిల్లాల పేరుతో కృష్ణా నీళ్లను ఏపీకి తరలించినట్టు.. ఇప్పుడు అదే ప్రాతిపదికన తెలంగాణ రైతుల ప్రయోజనాలను తక్కువ చేసి చూపుతూ బేసిన్‌లో లేని రైతుల ప్రయోజనాలే ముఖ్యమన్నట్టు వార్తలు ప్రచురిస్తున్నారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ గురించి ఈ మీడియా రాసిన వార్తలను మనం చూశాం. కాళేశ్వరానికి వ్యతిరేకంగా జాతీయ నిపుణులు మొదలుకొని అనామకులు చెప్పే విషయాల వరకు మొదటి పేజీల్లో ఏ విధంగా ప్రచురించారో గుర్తుచేసుకోవాలి. ఎక్కడా వినపడని, చదువని వాదనలను కాళేశ్వరంపై ప్రచురించారు. టీవీల్లో ప్రసారం చేశారు. జల నిపుణులుగా చెప్పుకొనే వ్యతిరేకుల అభిప్రాయాలకు ఇచ్చిన విలువ కాళేశ్వరం వల్ల ఒనగూడే ప్రయోజనాలకు ఈ మీడియా ఇవ్వలేదు. నరనరానా తెలంగాణ అంటే వ్యతిరేకత నింపుకొన్న ఒక మేధావి వర్గం కాళేశ్వరం వల్ల కళ్లకు కనిపిస్తున్న అభివృద్ధిని విస్మరించింది. వారికే ఈ మీడియా పెద్దపీట వేస్తున్నది. ముఖ్యంగా వారి అభిప్రాయాలను ప్రచురిస్తున్నాయి ఈ పత్రికలు. టీవీల్లో చూపిస్తున్నారు. కాళేశ్వరం విషయంలో అదే జరుగుతున్నది. కాళేశ్వరం, బనకచర్ల కథనాల్లో మనకు ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. తెలంగాణను కించపరచడం, తెలంగాణ ప్రయోజనాలను తక్కువ చేయడం, తెలంగాణను ఆర్థికంగా దెబ్బతీయడమే ఈ వర్గం మీడియా లక్ష్యం. తాము చదివే పత్రికలు, చూసే టీవీ చానళ్లు చాలా అరుదుగా తమ సమస్యలను ప్రస్తావిస్తాయని తెలంగాణ రైతు లు గుర్తించాలి. తాము చెప్పింది, చూపించిందే ముఖ్యమైన అంశమని భావించేలా ఈ పక్షపాత మీడియా తెలంగాణ ప్రజలపై తమ అభిప్రాయాలను రుద్దుతుంది. తెలంగాణ ప్రాజెక్టులను విస్మరించే మీడియా, వార్తాపత్రిక లు.. తెలంగాణ ప్రయోజనాలను సమర్థించే పత్రికల కంటే ఎక్కువగా ప్రాచు ర్యం పొందడం మన దురదృష్టకరం.

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తుగ్గలి నవీన్ రెడ్డి



**తుగ్గలి జూలై 17 ( ప్రభ మనం న్యూస్):** విజయవాడలోని నోవోటెల్ హోటల్‌లో శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌ను పత్తికొండ నియోజకవర్గ బీజేపీ నాయకుడు తుగ్గలి నవీన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుల బృందంతో కలిసి జరిగిన సమావేశంలో నవీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు, దేశ ఆర్థికాభివృద్ధిలో యువత పాత్ర వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఆమె నాయకులకు సూచించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు




**మంత్రాలయం , జూలై ,17,మనం న్యూస్ ;** మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన వైసీపీకి కార్యకర్తలు దావీదు, కృపానంద్, శేషప్ప, శివ, శేఖర్, రూబెన్, జాన్, పశులన్న, పౌలు, బొజ్జప్ప, నాగరాజు, చంద్ర మిగిలిన20 కుటుంబాలు శుక్రవారం టీడీపీ లోకి చేరారు. వారికి మంత్రాలయం టీడీపీ ఇంచార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి , మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్. రామకృష్ణ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీ లో ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇంచార్జి శ్రీ ఎన్. రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు.. మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధే మా ప్రధాన లక్ష్యం. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రాలయం నియోజకవర్గంలో కూడా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, బంద్రాళ్ల నరసింహులు, పోలి శివ, గ్రామ అధ్యక్షులు ఈరన్న, బాలరాజు, ఉసేని, జనసేన ఏసోబు, చిదానంద, తిమ్మప్ప, వెంకటేష్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుగ్గలిలో వర్షాల కోసం వరుణ జపాలు.. గుడి, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు






**తుగ్గలి, జూలై:17( ప్రభ మనం న్యూస్ ):** మండల కేంద్రమైన తుగ్గలిలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, కరవు ఛాయలు తొలగిపోవాలని కాంక్షిస్తూ గ్రామస్తులు గురువారం ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడక పంటలు ఎండిపోయే పరిస్థితి రావడంతో.. వరుణ దేవుడి కరుణ కోసం గ్రామస్తులంతా ఏకమయ్యారు.

**అమ్మవారి ఆలయంలో జలకడవలతో పూజలు:** గ్రామంలోని స్థానిక అమ్మవారి ఆలయంలో మహిళలు, చిన్నపిల్లలు తలపై నీటి కడవలు పెట్టుకుని ఊరేగింపుగా తరలివచ్చారు. అమ్మవారికి జలాభిషేకాలు చేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వర్షాలు కురిపించి పంటలను, ప్రజలను కాపాడాలని వేడుకున్నారు.

**మసీదులో ఖురాన్ పఠనం:** మరోవైపు, స్థానిక పీర్ల మసీదులో ముస్లిం సోదరులు పవిత్ర ఖురాన్ పఠించి అల్లాహ్‌ను వేడుకున్నారు. వరుణ దేవుని రాక కోసం ప్రత్యేక దువా (ప్రార్థనలు) చేశారు. హిందూ, ముస్లింలు అనే భేదం లేకుండా గ్రామస్తులంతా కలిసికట్టుగా తమ తమ ప్రార్థనా మందిరాల్లో వరుణ దేవుని కోసం పూజలు, ప్రార్థనలు చేయడం స్థానికంగా మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# తనదాకా వస్తే గానీ..



ఓ మహిళ ఒక రోజు గాంధీజీ వద్దకు వచ్చారట. గాంధీజీతో తన గోడు ఇట్లా వెళ్లబోసుకున్నారట. 'బాపూజీ.. నా కుమారుడు నిత్యం బెల్లం తింటున్నాడు. ఎంత చెప్పినా వినడం లేదు. మీరు చెప్తే వింటాడని మీ వద్దకు తీసుకొచ్చాను' అని ఆమె చెప్పారట. అయితే తనకు ఓ వారం రోజుల సమయం కావాలని ఆమెను గాంధీజీ అడిగారట. అంత వ్యవధి ఎందుకని గాంధీజీని తన అనుచరులు అడిగారట. వారం రోజుల తర్వాత ఆ బాలుడిని పిలిపించి బెల్లం తినొద్దని గాంధీజీ చెప్పి పంపించారట. తనకూ బెల్లం తినే అలవాటు ఉన్నది కాబట్టే, తాను మారిన తర్వాత గానీ ఇతరులకు నీతులు చెప్పొద్దనే ఉద్దేశంతోనే తాను మొదట ఆ బాలునికి దీని గురించి చెప్పలేదని గాంధీజీ తన అనుచరులకు చెప్పారట. అంటే తాను పాటించకుండా ఏ విషయం ఇతరులకు చెప్పొద్దని గాంధీజీనే చెప్పారు. ఇదంతా ఇప్పుడెందుకు అంటే మీడియా గొంతు నొక్కేస్తున్నారని గతంలో చెప్పిన మన ముఖ్యమంత్రి ఇప్పుడు అదే మీడియా విషయంలో, ప్రధానంగా జర్నలిస్టుల విషయంలో వ్యవహరిస్తున్న తీరు గురించి చెప్పేందుకే ఈ ఉపోద్ఘాతం. రాష్ట్ర ముఖ్యమంత్రి తాను విపక్షంలో ఉన్నప్పుడు మీడియా హక్కుల గురించి మాట్లాడారు. జర్నలిస్టులకు అండగా ఉంటానన్నారు. నాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని చెప్పిన ఆయన ఇప్పుడు తనను ప్రశ్నిస్తున్నవారిని అసలు జర్నలిస్టులే కాదంటున్నారు. అంతేకాదు, మీడియా మీట్‌లో ముందు వరుసలో కాలు మీద కాలేసుకొని కూర్చుని తమకు నమస్కారం పెట్టాలనే ధోరణిలో జర్నలిస్టులు ఉంటున్నారని ఎద్దేవా చేస్తూ, అలాంటివారి చెంప చెల్లుమనిపించాలన్నారు. అంతేకాదు, కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులుగా చెలామణి అవుతున్నారని కూడా ఫైరయ్యారు. 'అ ఆ'లు కూడా రానివారు తాము జర్నలిస్టులమ ని చెప్పుకొంటున్నారని సెలవిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ పాలన గురించి సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని కొందరి చేత పనిగట్టుకుని దుష్ప్రచారం చేయించిన ఆయనకు నాటి మీడియా ఎంతో నచ్చింది. అప్పట్లో ఏ ఆధారాలు లేకుండానే బురదజల్లిన ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రస్తుత ముఖ్యమంత్రి సహా నాడు వాటిని ప్రసారం చేసిన జర్నలిస్టు సమూహాల గురించి ఆహా ఓహో అంటూ కొనియాడారు. కానీ, ప్రస్తుతం అధికారంలోకి రాగానే అవే వేళ్లు తన వైపునకు చూపేసరికి అసెంబ్లీ సాక్షిగా బట్టలూడదీసి జర్నలిస్టులను కొట్టాలంటున్నారు. తమ సమస్యలను చెప్పుకోవడానికి ఒక వేదికగా నిలిచే ప్రెస్ క్లబ్‌ను కల్లు కాంపౌండ్, పబ్బులతో పోల్చడం ముఖ్యమంత్రికే చెల్లింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భానికి ముందు కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై తమ ఇష్టానుసారంగా మాట్లాడారు. అప్పుడు సంతో షపడిన ఇదే సీఎం, ఇప్పుడు కస్సుబుస్సులా డుతున్నారు. తన దాకా వస్తే ఇలా ఉంటుం దా? కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులు, మీలాంటి రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం పనిచేస్తే జర్నలిస్టు సమాజమంతా తప్పు చేసినట్టు మాట్లాడటం, చులకనభావంతో చూడ టం సరికాదు. జర్నలిస్టులు అనేవాళ్లను సమాజంలో చెడుగా చూపించే ప్రయత్నాన్ని మీరు పనిగట్టుకుని చేయడాన్ని జర్నలిస్టులు గాని, జర్నలిస్టు సంఘాలు గాని సహించవు. మన సీఎం మాత్రమే కాదు, ఆయన పాత మిత్రులు, ఆ మిత్రులకు తోడైన కొందరు కొత్త మిత్రులు.. అందరూ మీడియాపై విరుచుకుపడుతున్నవారే. ఎటొచ్చి జర్నలిస్టులే ఎటూ కాకుండాపోతున్నారు. రాహుల్‌గాంధీ నిత్యం ప్రజాస్వామ్యం గురించి, భావప్రకటనా స్వేచ్ఛ గురించి మాట్లాడుతున్నారు. చేతిలో రాజ్యాంగం గం పుస్తకాన్ని పట్టుకొని తిరిగే ఆయనకు ఆ రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1)(ఏ) భావప్రకటనాస్వేచ్ఛ గురించి బాగా తెలుసు కాబట్టి, మీడియాకు స్వేచ్ఛ ఉండాలని కోరుకుంటున్నారు. తన గురించి ఎవ్వరు , ఏం మాట్లాడినా ఫర్వాలేదంటున్నారు. తనకు నచ్చిన విధంగా ముందుకెళ్తానని చెప్తున్నారు. కానీ, మన సీఎం మాత్రం, వాళ్ల అధినాయకుడి బాట కు భిన్నంగా వ్యవహరిస్తున్నట్టు స్పష్టంగా అర్థమవుతున్నది. ఏడాదిన్నరలోనే తమను ప్రశ్నించిన జర్నలిస్టులపై ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో మన కండ్లముందున్నది. ఒక చెం ప కొడితే మరో చెంప చూపించాలనే గాంధీజీ సిద్ధాంతాన్ని కాంగ్రెస్ పార్టీ ఏనాడో గాలికి వదిలేసింది. అయితే మన ముఖ్యమంత్రి గాంధేయ మార్గంలో నడుస్తున్నానని బయటకు చెప్తూనే అనేక చోట్ల ఆవేశంతో మాట్లాడే మాట లు యథావిధిగా మీడియా ప్రసారం చేస్తే మాత్రం సదరు ముఖ్యమంత్రికి చిర్రెత్తుకొస్తుంది. పలు సభల్లో ఆయన మాట్లాడుతూ పేగులు మెడలో వేసుకుంటానని, బట్టలూడదీసి కొడతానన్నారు. ఆ మాటలను యథావిధిగా ప్రసారం చేస్తే జర్నలిస్టులపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వ పాలన జనరంజకంగా ఉంటే జర్నలిస్టులు అదే విషయాన్ని రాస్తారు. లేదు, ప్రజా కంతకంగా పాలన సాగుతుంటే దానిని ప్రశ్నల రూపంలో సంధించి పాలకులకు తెలిసివచ్చేలా చేస్తుంటా రు. పాలకులనేవారు సద్విమర్శలను, సూచన రూపంలో వచ్చే వార్తలను అనుకూల దృక్పథంతో తీసుకోవాలి. అంతేకానీ, మీడియా సం స్థలు తమకు బాకా ఊదాలని, ఇంద్రుడు చం ద్రుడు అని పొగడాలని, తాము ఏం చేసినా ఏ నిర్ణయం తీసుకున్నా అదే సరైనదన్న రీతిలో వార్తలు కవర్ చేయాలని భావించడం పెద్ద తప్పు. తమ తప్పులను సరిచేసుకోకుండా మీడియాపైనా, జర్నలిస్టులపైనా విరుచుకుపడటం ఈ మధ్య ప్రతీ ఒక్కరికి ఫ్యాషన్‌గా మారింది. ఏ విభాగంలోనైనా ఒక్కరో, ఇద్దరో తప్పులు చేస్తుంటారు, అంతమాత్రాన మొత్తం ఆ విభాగానికే అంటగట్టడం, తక్కువ చేసి మాట్లాడటం ఏలికలకు తగదు. సమాజంలో గౌరవప్రదమైన వృత్తిగా భావించే జర్నలిజం, ఆ వృత్తిని ఆధారంగా చేసుకొని జీవిస్తున్న జర్నలిస్టులపై చులకనాభావం తగదు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛకు రాజకీయులు ప్రతిబంధకాలుగా మారడం మంచిది కాదు.

Office adress....EDITED & PUBLISHED AND OWNED BY.EDITOR : V.LINGAMURTHY. PUBLISHED AT : VSAR PUBLICATION VSAR PUBLICATIONS91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006CONTACT NO :9000367833.RNI,APTEL/26/A 3829,E-MAIL.ID prabhamanam@gmail.com